క్లుప్తంగా

నేడు మంగపల్లెలో వైద్య శిబిరం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి తెలిపారు. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుండె, ఊపిరితిత్తులు, స్త్రీ వ్యాధులు, ఎముకలు, కీళ్లు, కంటి సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేస్తారన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



విద్యార్థినులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బనగానపల్లె రూరల్: వసతి గృహాల్లోని విద్యార్థులు సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని టంగుటూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. శనివారం పట్టణంలోని రవ్వల కొండపై ఉన్న జ్యోతిరావు పూలే బాలుర వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహం, మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాలను సందర్శించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు భోజనానికి ముందు ఆ తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని, రాత్రి దోమ తెరలను వాడాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వెంటనే వైద్యులను సంప్రదించి తగిన మందులను వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామంలో త్వరలో నిర్వహించనున్న భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని అమడాలలో రీసర్వే కార్యక్రమానికి సంబంధించి రైతులకు అవగాహన కల్పించారు. గతంలో కలుగొట్ల, భీమునిపాడు, లింగాల, బిజనవేముల, కంపమల్ల గ్రామాల్లో భూముల రీసర్వే జరిగిందన్నారు. రెండో విడతలో అమడాల గ్రామం ఎంపికైందని తెలిపారు. సర్పంచ్ బాలమద్దిలేటి, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, వీఆర్వో మురళీ, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

జీఆర్‌పీ ఎస్‌ఐగా బాధ్యతలు



సి.బిందుమాధవి

డోన్ రూరల్: రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐగా సి.బిందుమాధవి శనివారం డోన్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. ఆమె కర్నూలు టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు రైల్వే సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆకతాయిలకు అడ్డాగా హెల్త్ సెంటర్



బుగ్గానిపల్లెలో నిరుపయోగంగా ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

బేతంచెర్ల: నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.80 లక్షలతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించారు. ఈ ఏడాది జనవరి 13వ తేదీ అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. ప్రారంభించి సుమారు 9 నెలలు అవుతున్నా ఇప్పటికీ భవనం వినియోగంలోకి రాలేదు. దీంతో ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి ఆకతాయిలకు అడ్డాగా మారింది. కిటికీ అద్దాలను పగలగొట్టారు. రాత్రి వేళల్లో మద్యం సేవిస్తున్నారు. అధికారులు స్పందించి అర్బన్ హెల్త్ సెంటర్‌ను వినియోగంలోకి తీసుకునిరావాలని స్థానికులు కోరుతున్నారు.

విజయవంతం చేద్దాం

బనగానపల్లె: ఈ నెల 31వ తేదీ ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య అన్నారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏఐటీయూసీ పని చేస్తోందని తెలిపారు. సమావేశంలో యూనియన్ నాయకులు రవి, శివబాలకృష్ణ, సంజీవులు, కుళ్లాయిస్వామి, బాలసంజీవులు పాల్గొన్నారు.

'పచ్చ'పాతం

- టీడీపీ నాయకులు చెప్పిందే వేదం
- వారి చేతిలో కీలుబొమ్మగా మారి వివాదాస్పద నిర్ణయాలు
- తాజాగా మున్సిపల్ కార్యాలయానికి తాళం
- మాజీ మంత్రి బుగ్గన వాకింగ్‌కు రాకుండా అడ్డుకోవడంపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- ఆది నుంచి వివాదాస్పదుడిగా డోన్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్



మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న వాకింగ్ ట్రాక్

డోన్: డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ టీడీపీ నాయకులకు వీర విధేయుడిగా మారి వివాదాస్పద నిర్ణయాలతో విమర్శలను మూటగట్టుకుంటున్నారు. తాజాగా ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎప్పటిలాగే మార్నింగ్ వాకింగ్ చేసేందుకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లగా, ప్రధాన ద్వారానికి కమిషనర్ తాళం వేయించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. మున్సిపల్ కమిషనర్ పదవీ బాధ్యతలు చేపట్టి నెలరోజులు కాకముందే వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ టీడీపీ నాయకుల చేతిలో కీలుబొమ్మగా మారి ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మండిపడుతున్నారు. ప్రధాన గేటుకు పనివేళల్లో తాళం వేయించడంపై టీడీపీ నాయకులు, కమిషనర్ శుక్రవారం ఒకేమాట మాట్లాడి మరునాడు శనివారం పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేయడంపై ప్రజలు ఈసడించుకుంటున్నారు. మాజీ మంత్రి వాకింగ్ చేయడానికి పట్టణంలో పార్కులు చాలా ఉన్నాయని నోరు పారేసుకున్న కమిషనర్‌కు వంత పాడేందుకు టీడీపీ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి శుక్రవారం డ్రై డేగా నిర్ణయించి పార్కును శుభ్రం చేసేందుకు తాళం వేయాల్సి వచ్చిందని ప్రకటించారు. దీన్ని బట్టి చూస్తే చేసిన తప్పును సరిదిద్దుకునేందుకు నానా తంటాలు పడుతున్నట్లు స్పష్టమవుతోంది. మాజీ మంత్రి రాక గురించి తమకు సరైన సమాచారం లేదని ఒకసారి, డ్రైడేగా ప్రకటించినందువల్ల తాళం వేయాల్సి వచ్చిందని మరోసారి, వాచ్‌మెన్ అనారోగ్య కారణాల వల్ల తాళం వేసుకుని వెళ్లిపోయాడని వేరొకసారి కమిషనర్ మాట్లాడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కుడా పార్కుపై కమిషనర్ పెత్తనమేంటి?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మంజూరు చేసిన రూ.40 లక్షలతో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 2023 నవంబర్ 3వ తేదీ ల్యాండ్ స్కేపింగ్ పాత్‌వేను ప్రారంభించారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో వాకర్స్ ఇక్కడ మార్నింగ్, ఈవినింగ్ వాక్ చేస్తుంటారు. మాజీ మంత్రి బుగ్గన ఓటమి చెందిన తర్వాత కూడా ఈ పార్కులో మూడుసార్లు ఉదయం వాకింగ్ చేసి వెళ్లారు కూడా. అయితే అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడే టీడీపీ నాయకులకు ఎందుకు వచ్చిందని స్థానికులు నిలదీస్తున్నారు. కుడా పార్కుపై మున్సిపల్ కమిషనర్ పెత్తనం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

ఆది నుంచి వివాదస్పదమే

మొదటి సర్వసభ్య సమావేశంలోనే కౌన్సిలర్ దినేష్‌గౌడ్ వరుసగా మూడు సమావేశాలకు హాజరు కావడం లేదనే నెపంతో ఎలాంటి నోటీసు లేకుండా ఆయన సభ్యత్వం రద్దు చేయాలని అజెండాలో చేర్చి అభాసుపాలయ్యారు. ఇదే కాక మరో నాలుగు అంశాలను కూడా చైర్మన్ సప్తశైల రాజేష్‌తో సంప్రదించకుండానే కొత్త అజెండా తయారుచేసి సమావేశంలో ఆమోదం కోసం ఉంచడంపై మెజార్టీ కౌన్సిల్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యక్రమాల్లో చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లను ఆహ్వానించకుండా టీడీపీ నేతలను వెంట బెట్టుకుని నిర్వహించడం ఆయన తీరుకు అద్దం పడుతుంది.



కుడా నిధులు రూ.40 లక్షలతో నిర్మించినట్లు స్పష్టం చేస్తున్న శిలాఫలకం

సమంజసం కాదు



ప్రజాధనంతో నిర్మించిన పార్కుకు రాకుండా ఏకంగా రాష్ట్ర మాజీ మంత్రినే అధికార పార్టీ నాయకుల మాటలు విని కమిషనర్ అడ్డుకున్నారంటే ఇక సామాన్యులకు దిక్కేముంది. పట్టణ ప్రజలు ముఖ్యంగా యువకులు, వయోవృద్ధులు శారీరక దృఢత్వం కోసం ఈ పార్కులో వాకింగ్ చేస్తుంటారు. రాజకీయ కక్ష్యలతో పార్కుల్లో తిరగకుండా చేయడం సమంజసం కాదు.

–వెంకటేశ్వరమ్మ, కౌన్సిలర్, డోన్

మంచి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు



పార్కులోకి మాజీ మంత్రితో పాటు వాకర్లను రానివ్వకుండా అడ్డుకోవడం దుర్మార్గం. ఆహ్లాదకరమైన వాతావరణంలో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఈ పార్కులు ఎంతో దోహదం చేస్తాయి. ఇలాంటి పార్కులలో వాకింగ్‌కు వస్తే దురుద్దేశాలు అంటగట్టి అడ్డుకోవడం పట్టణంలో ఉన్న మంచి వాతావరణాన్ని కలుషితం చేసేవిధంగా ఉంది.

–ఆర్‌ఈ సరళమ్మ, గృహిణి, పాతపేట, డోన్

వాకింగ్‌కు ఎలాంటి ఆటంకం ఉండదు



మాజీ మంత్రి వాకింగ్‌కు వస్తున్నారన్న విషయంపై నాకు సమాచా రం లేదు. అనారోగ్య కారణాల వల్ల వాచ్‌మెన్ విధులకు హాజరు కా నందున ప్రధాన గేటు తాళం తీయడంలో ఆలస్యం జరిగింది. ఇకపై ఎవరైనా వాకింగ్ చేసుకోవచ్చు. ఎలాంటి అసౌకర్యం కల్పించం.

–ప్రసాద్‌గౌడ్, మున్సిపల్ కమీషనర్, డోన్.

వాల్మీకి గుహలను సందర్శించిన జేసీ



వాల్మీకి గుహల్లో స్థానికులతో మాట్లాడుతున్న జేసీ

ప్యాపిలి: మండల పరిధిలోని బోయవాండ్లపల్లి వద్ద ఉన్న వాల్మీకి గుహలను జేసీ విష్ణుచరణ్, ఆర్డీఓ మహేశ్వర్ రెడ్డితో కలిసి సందర్శించారు. స్థానికులు, పర్యాటకులతో మాట్లాడారు. వాల్మీకి గుహలకు సంబంధించిన విశేషాలను అడిగి తెలుసుకున్నారు. సహజసిద్ధంగా వెలసిన గుహలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని జేసీ తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రికార్డుల గదిని పరిశీలించి రికార్డులను భద్రంగా ఉంచుకోవాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ భారతిని ఆదేశించారు. వీఆర్‌ఓ రమణారెడ్డి ఉన్నారు.

ఆర్డీఓకు బదిలీ సన్మానం



మహేశ్వరరెడ్డికి వీడ్కోలు పలుకుతున్న ఉద్యోగులు

డోన్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం అని ఆర్డీఓ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆర్డీఓ ఇక్కడి నుంచి బదిలీ కావడంతో శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రెవెన్యూ ఉద్యోగులు ఆయన్ను సత్కరించి వీడ్కోలు పలికారు. తదుపరి పోస్టింగ్ ఉత్తర్వుల కోసం అమరావతిలోని ప్రిన్సిపల్ కార్యదర్శి కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. డోన్ ఆర్డీఓగా తిరుపతిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నరసింహులు ఇక్కడికి బదిలీ అయ్యారు. కార్యక్రమంలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, కోవెలకుంట్ల తహసీల్దార్లు, డీటీలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



ఖైదీలతో సమావేశమైన జడ్జి

డోన్ టౌన్: వివిధ కారణాలు, నేరాలతో రిమాండ్ ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న వారు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. పట్టణంలోని సబ్ జైలును శనివారం ఆమె తనిఖీ చేశారు. జైలు పరిసరాలు, భోజన వసతి, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం ఖైదీలతో సమావేశం నిర్వహించారు. న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్థోమత లేని వారికి ప్రభుత్వం నుంచి న్యాయవాదిని ఏర్పాటు చేసి న్యాయసేవలను అందిస్తామని తెలిపారు. సమావేశంలో జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, న్యాయవాది మధు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



మోటర్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

బేతంచెర్ల: స్థానిక ధరణి టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి సొంత నిధులు రూ.14 వేలతో మోటర్ ఏర్పాటు చేశారని హెచ్‌ఎం అబ్రహం తెలిపారు. అలాగే నూతన భవనంలో సెల్ఫుల కోసం 7 చదరాల బండలను అందజేస్తామని హామీ ఇచ్చారన్నారు. నగర పంచాయతీ చైర్మన్‌కు హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక





విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం, సంజామల: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాన్విత రాష్ట్ర స్థా యి బ్యాడ్మిం టన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ ఎం గీతా తెలిపా రు. ఈ నెల 24వ తేదీ నంద్యా లలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ బ్యాడ్మి ంటన్ పోటీల్లో సత్తాచాటిందన్నారు.విద్యార్థినిని హెచ్‌ఎంతోపాటు ఫిజికల్ డైరెక్టర్లు హర్ష, ఓబులేసు, ఉపాధ్యాయులు అభినందించారు.

సంజామల: మండల పరిధిలోని నొస్సం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుదర్శన్ రావు తెలిపారు. కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో వైష్ణవి (అండర్–14), అనీల్ (అండర్–17), షటిల్ బ్యాడ్మింటన్‌లో టి.సిరి(అండర్–17) ప్రతిభ చాటి నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రను హెచ్‌ఎం అభినందించారు.

అమడాలలో తాగునీటి కష్టాలు

- మూతపడిన మినరల్ వాటర్‌ప్లాంట్లు
- 20 రోజులుగా నీటికి ఇక్కట్లు



అమడాలలో మూతపడిన మినరల్ వాటర్‌ప్లాంట్

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామంలో ప్రజలు 20 రోజుల నుంచి తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో రెండు మినరల్ వాటర్‌ప్లాంట్లు ఉన్నాయి. ఇటీవల ఈ ప్లాంట్లలో నీటిని శుద్ధి చేసే మెమోరీలు దెబ్బతినడంతో నీటి సరఫరా నిలిచిపోయి ప్లాంట్లు మూతపడ్డాయి. పునరుద్ధరించి నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. దీంతో చేసేది లేక గ్రామస్తులు సైకిళ్లు, బైక్‌ల ద్వారా పక్క గ్రామాలైన సొదరదిన్నె, బిజనవేములకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వాటర్‌ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టి నీటిసరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం





కోవెలకుంట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, డోన్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ

కోవెలకుంట్ల: సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని.. అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్, మహిళలపై జరుగుతున్న నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఖాతాల్లో నగదును పోగొట్టుకుంటున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఫోన్‌చేసి వ్యక్తిగత సమాచారం, బ్యాంకు, ఆధార్, పాన్ కార్డు, ఏటీఎం, తదితర వివరాలు అడిగితే ఎలాంటి పరిస్థితుల్లో చెప్పవద్దని సూచించారు. పట్టణాల్లో ట్రాఫిక్ పెరిగిందని.. నిబంధనలు పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఇటీవల కాలంలో మహిళలు, విద్యార్థినులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రమాదేవి, సీఐ హనుమంతునాయక్, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

డోన్ టౌన్: మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని..వాటికి దూరంగా ఉండాలని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. మండలంలోని యు.కొత్తపల్లె జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరగాళ్లు మొబైల్ ఫోన్లను హ్యాక్ చేసి ఖాతాల్లో నగదు కాజేస్తారని.. కొత్త నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్, లింక్‌లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు. మైనర్‌లు వాహనాలు నడపడం కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరగడానికి అవకాశం ఉందన్నారు. హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు బాలరంగారెడ్డి, రాంప్రసాద్, సుబ్రమణ్యం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి సేవలో ఆర్‌జేకే

బనగానపల్లె: మండలంలోని చౌడేశ్వరిదేవి అమ్మవారిని దేవదాయశాఖ మల్టీ జోన్–2 రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన అభిషేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, ఈఓలు రామాంజనేయులు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రేపు వేలం పాట

బనగానపల్లె: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 28న కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు, కొబ్బరి చిప్పలు, తలనీలాల సేకరణ కోసం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ చంద్రుడు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ శంషాద్‌బేగం

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్‌నగర్ గ్రామంలోని 1, 2, 4,5, హెచ్ కొట్టాల, కె.కొట్టాల, ఆర్.కొత్తపల్లె గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను డోన్ ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం, సూపర్ వైజర్ తిప్పమ్మ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లోని 7 సెంటర్లను సాక్షం అంగన్‌వాడీ కేంద్రాలుగా ఎంపిక చేశామని తెలిపారు. వీటిలో న్యూట్రిగార్డెన్ పెంచేందుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రాల్లో ప్రీస్కూల్ నమోదు పెంచాలని సూచించారు. అనంతరం న్యూట్రీగార్డెన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.

రేషన్ సరఫరాలో అలసత్వం వద్దు



అధికారులతో మాట్లాడుతున్న జేసీ విష్ణు చరణ్

డోన్ రూరల్: మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామం వద్ద సివిల్ సప్లైస్ గోడౌన్‌ను శనివారం నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ తనిఖీ చేశారు. కార్డుదారులకు సక్రమంగా రేషన్ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తూకాల్లో అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. ప్రతి నెలా అన్ని రేషన్ షాపులకు సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లపై ఫిర్యాదులు వస్తే వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ నాగమణి తదితరులు ఉన్నారు.

రంగస్వామి చిత్రంలో రాయలసీమ నటులే



రంగస్వామి పాత్ర పోషించిన ఏడీఏ మారుతి సకారమ్‌ను అభినందిస్తున్న అభిమానులు

బనగానపల్లె రూరల్: రంగస్వామి చిత్రంలో అందరూ రాయలసీమ నటులే ఉన్నారని ఆ చిత్రంలో టైటిల్ రోల్ పోషించిన స్థానిక పశువైద్యశాల ప్రాంతీయ సహాయ సంచాలకులు(ఏడీఏ) మారుతి సకారమ్ అన్నారు. శనివారం పట్టణంలోని జీఎం టాకీస్‌లో చిత్ర ప్రదర్శన సందర్భంగా సందడి చేశారు. ప్రేక్షకులతో కలిసి సినిమా చూశారు. ప్రస్తుతం కొందరు యువకులు చెడుఅలవాట్లు, డ్రగ్స్‌కు బానిసై పెడదారిన పడుతున్నారని..అలా చెడుదారిన పట్టిన తన కుమారుడిని రంగస్వామి ఏం చేశాడన్నదే ఈ చిత్రం అని తెలిపారు.

ఓటుహక్కు నమోదు పౌరుల బాధ్యత



మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: మండలంలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిదాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి అధ్యక్షతన శనివారం ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పొందడం ఎంతో గర్వకారణంగా భావించాలని, ఓటు నమోదు చేసుకోవడం బాధ్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఓటు హక్కుపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, కృష్ణశశాంక, సంటిరెడ్డి, సభాస్‌రెడ్డి, షహనాజ్, హుస్సేన్ పాల్గొన్నారు.

మంత్రికి కార్తీకమాస ఆహ్వాన పత్రిక అందజేత

బనగానపల్లె రూరల్: ప్రముఖ శైవక్షేత్రం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో జరిగే కార్తీకమాస మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ అర్చకులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులకు శనివారం ఆహ్వానపత్రిక అందజేశారు. నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.చంద్రుడు తెలిపారు. ఆలయ అర్చకులు మహేష్, సత్యమయ్య, చంద్రమౌళీశ్వరరెడ్డి ఉన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



సభ్యత్వ నమోదు తీసుకుంటున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ సభ్యత్వ నమోదును మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ.. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే వారికి ప్రమాద బీమాతో పాటు కుటుంబ సభ్యులకు విద్య, వైద్య సహాయం అందజేస్తామని తెలిపారు.